క్లుప్తంగా

మంత్రికి వినతి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి

కొయ్యూరు: రేవళ్లలో పాఠశాల ఏర్పాటు చేయాలని బుధవారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి జీసీసీ మాజీ చైర్మన్ ప్రసాద్, సర్పంచ్ వెంకటలక్ష్మి కోరారు. గ్రామంలో పాఠశాల లేక విద్యార్థులు పడుతున్న అవస్థలను ఆమెకు వివరించినట్టు సర్పంచ్ చెప్పారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేశారన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ



జడ్డంగిలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్థానిక ప్రజాప్రతినిధులు బుధవారం స్కూల్ బ్యాగ్‌లు, షూస్ తదితర స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాగా చదువుకోవాలని హితవు పలికారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ సీహెచ్.చక్రవేణి, హెచ్ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.మాడుగుల: మండల పరిధిలో గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు పాడేరు విద్యుత్‌శాఖ ఈఈ ఏఈఎస్ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైవే రోడ్డు నిర్మాణ ప్రదేశంలో విద్యుత్ లైన్లు మార్పుల నిమిత్తం పాడేరు నుంచి జి.మాడుగుల వరకు సబ్‌స్టేషన్‌కి వచ్చే 33 కేవీ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్న ట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి అధికారులు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

బోరు బావుల నిర్మాణానికి నిధులు

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందించేందుకు జెడ్పీ నిధులు నుంచి రూ.6లక్షలు నిధులు మంజూరైనట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఏ విజయకుమార్ తెలిపారు. 2024–25సంవత్సరం నకు స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి మండల పరిధిలో గ్రామాల్లో తాగునీటి కోసం నిధులు మంజూరుకు ప్రతిపాదన మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి పనులు మంజూరయ్యాయన్నారు.మండలంలో వంజరి పంచాయతీ పినకిల్తారి గ్రామంలో రూ.1.50లక్షలు, భీరం పంచాయతీ కేంద్రంలో రూ.1.50లక్షలు, సింగర్బ పంచాయతీలో చేపల్లి గ్రామంలో రూ.1.50లక్షలు, భీరం పంచాయతీలో వనెల్బ గ్రామంలో రూ.1.50లక్షలు చొప్పున బోర్‌బావుల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్టు తెలిపారు. పనులు వేగవంతం చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

44 మందికి వైద్య పరీక్షలు



చికిలింతలో రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత, దుర్గానగర్ గ్రామాల్లో బుధవారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో 44 మంది రోగుల ను పరీక్షించినట్టు డాక్టర్ యామినిప్రియ తెలిపారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిస్థితులు పరిశీలించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించామన్నారు. సుగర్, బీపీ సమస్యలున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. 104 డీఈఓ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ మురళి, హెల్త్ అసిస్టెంట్ రాజబాబు, సచివాలయ సిబ్బంది, ఆశ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మెలకువలతో అధిక దిగుబడి

- యాజమాన్య పద్ధతులతో మేలు
- రైతులకు వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి సూచనలు



పచ్చని పొలాలు

అనంతగిరి: ఏజెన్సీలోని తొలకరి వర్షాలు కురుస్తుండడంతో గిరిజన రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వరితో పాటు వాణిజ్య పంటల సాగు పనులు జోరుగా జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రైతులు ఖరీఫ్ వరి నాడుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై మండల వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరి పలు సూచనలు, సలహాలు తెలియజేస్తున్నారు. వరి నాడుమడుల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, విత్తనాలు ఎంపిక, భూమి చదును చేయడం, నేల స్వభావం, నీటి లభ్యత, విత్తనశుద్ధి, ఎరువుల మోతాదు. తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వరి సాగుకు ఆమ్ల, క్షార, చౌడు నెలల తప్ప అన్ని రకాల నేలలు అనుకూలమే.. నేల స్వభావాన్ని బట్టి ఎరువులను ఉపయోగించాలి. నీటి తడువు అందించడం వంటివి చేయాలి. నీటి తడువులు అధికంగా అవసరమైన నేలల్లో ఇతర పంటలు సాగుచేయడం రైతుకు లాభదాయకమని సూచించారు.

సాగుకు సన్నద్ధం

ఖరీఫ్‌లోని 2011 హెక్టార్లలో రైతులు కొంతమంది రైతులు వెదజల్లు పద్ధతిలో వరిసాగు చేస్తుండగా, మరికొంతమంది నాట్లు వేయు పద్ధతిలో సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోని వరినాడులు తయారుచేసుకుంటున్నారు. ప్రాంతానికి అనుగుణంగా వ్యవసాయశాఖ అధికారులు విత్తనాలు పంపిణీకి చర్యలు చేపట్టారు. ఆర్‌జీఎల్(శ్రీకాకుళం సన్నాలు), ఎంటీయూ(శ్రీధృతి), పీటీ (సాంబమాసురి) మొత్తం 581.8 క్వింటాలకు గాను 565.0 పంపిణీ చేయడం చేశారు. అలాగే 31.8 క్వింటాల పచ్చిరొట్ట, 6.6 క్వింటాల వేరుశనగా పంపిణీ చేశారు.

విత్తన మోతాదు.. విత్తన శుద్ధి

ఎకరానికి సరాసరిగా 15 నుంచి 20 కిలోల విత్తనం సరిపోతుంది. కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బండిజంను కలిపి ఆరబెట్టడం ద్వారా విత్తనశుద్ధి చేసుకోవాలి. అనంతరం వాటిని నారుమడుల్లో చల్లుకోవాలని ఏవో ఉమామహేశ్వరి చెబుతున్నారు.

విత్తే సమయం కీలకం

మధ్యస్థ స్వల్పకాలిక విత్తన రకాలను ప్రస్తుత సీజన్ నుంచి జూలై 15 వరకు నాట్లు వేసుకోవచ్చు. ఆగస్టు నెలాఖరు వరకు ప్రధాన పొలాల్లో నాట్లు వేసుకోవాలి. జూన్‌లో నారు వేయడం ద్వారా పంట కాలం పెరగడంతో పాటు పంట దిగుబడి బాగుంటుంది. దీర్ఘకాలిక రకాలు సాగుచేయడంతో చీడపీడల ఉధృతి పెరగడమే కాక నీటి వృథా కూడా ఎక్కువవుతుంది.

నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నారుమడిలో రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్టు వేసి రెండు, మూడుసార్లు బాగా దమ్ముచేసి చదునుచేయాలి. నారుమడులను కొంచెం ఎత్తులో తయారుచేసుకోవాలి.
- ఐదు సెంట్లు నారుమడిలో 1 కిలో నత్రజని, రెండు కిలోల భాస్వరం, ఒక కిలో పోటాష్‌ను ఇచ్చే ఎరువులను దుక్కిలో వేసుకోవాలి. విత్తనాలు వేసుకున్న 15 రోజుల తరువాత కిలో నత్రజనిని వేసుకోవాలి. నాట్లు ఆలస్యమైతే రెండో దఫాగా నత్రజని వేసుకోవచ్చు.
- విత్తనం చల్లి తరువాత మొక్క దశలో పలచగా నీరు ఉండాలి. మెట్ట నారుమడులలో ఇసుకధాతువు లోపం అత్యధికంగా కనిపిస్తుంది. దీని నివారణకు మొక్క ఎదుగుదలకు అనుగుణంగా ఒక గ్రాము ఉప్పును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- జింక్‌ధాతువు లోపం నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- నారుమడిలో నారు తీయడానికి పదిరోజుల ముందు కార్బోఫ్యూరాన్ మూడు గుళికలు 400 గ్రాములు ఇసుకలో పలచగా నీరు ఉంచి చల్లుకోవాలి.
- సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ ద్వారా నారును పెంచుకుంటే ప్రధాన పంటపొలంలోని వచ్చే సమస్యలను అధిగమించవచ్చు.

అవగాహన అవసరం



రైతులు వాతావరణం అనుకూలంగా ఉండడంతో పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలి. ప్రస్తుత ఖరీఫ్‌లో విత్తన ఎంపిక, శుద్ధి, నారుమడుల తయారీ, నాట్లువేసే సమయంలోని మెలకువలు పాటిస్తే ఆశించిన పంట దిగుబడి సాధించవచ్చు. వ్యవసాయశాఖ సిబ్బంది సూచలు ప్రకారం ఎరువులు అధికంగా వినియోగిస్తే పంటలో దిగుబడి సాధిస్తారు.

ఉమామహేశ్వరీ, ఏవో, అనంతగిరి

గిరిజనులందరికీ ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: గిరిజనులందరికీ పూర్తిస్థాయిలో ఉపాధి హామీ పథకం పనుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉపాధి పనులపై ఏపీవో రాంప్రసాద్‌తో ఆయన బుధవారం చర్చించారు. సాంకేతిక సమస్య కారణంగా మండలంలోని సుమారు 28 గ్రామాలకు ఉపాధి పనులు కల్పించలేదని, ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదులు చేయగా ప్రస్తుతం సమస్య పరిష్కారమైందన్నారు. ఇకపై ఆ గ్రామాల్లోని గిరిజనులందరికీ పూర్తిస్థాయిలో పనులు కల్పిస్తామన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ బోయినకుమారి

గూడెంకొత్తవీధి: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయినకుమారి అన్నారు. మండలంలోని మొండిగెడ్డ పంచాయతీకి సంబంధించి గ్రామ జరిగింది. సర్పంచ్ ప్రియాంక అధ్యక్షతన జరిగిన సభలో పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి పలు అంశాలపై తీర్మానాలు చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు రాజారావు, బుజ్జిబాబు, బాలన్న, శ్రీను, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు భవనం మంజూరు చేయాలి



బొడ్డగొందిలో విద్యార్థులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీ బొడ్డగొంది ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు శాశ్వత భవనం మంజూరు చేయాలని వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. బొడ్డగొంది పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. విద్యార్థులు రేకుల షెడ్డులో చదువుతూ ఉండడంపై ఆయన విచారణ వ్యక్తం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రేకుల షెడ్డు సైతం కారిపోతూ ఉండడంతో కూర్చొని చదవలేక పోతున్నామని విద్యార్థులు ఆయనకు సమస్యను తెలిపారు.ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి బొడ్డగొంది పాఠశాలకు నూతన భవనం మంజూరు చేసి 31 మంది విద్యార్థుల అవస్థలు తీర్చాలని కోరారు. గిరిజన ప్రాంతంలో భవనాలు లేని పాఠశాలలు అనేకం ఉన్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే ఆర్థిక లబ్ధి



బల్లుగూడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు: ప్రత్యామ్నాయ పంటల సాగుతో గిరిజన రైతులకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసబాబు అన్నారు. మండలంలో గల బాబుశాల పంచాయతీ బల్లుగూడ గ్రామంలో బుధవారం వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. లాభాలు వచ్చే పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. గంజాయి సాగువల్ల కలిగే అనర్థాలపై వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాస బాబు మాట్లాడుతూ గిరిజన రైతులు అధిక ఆదాయాన్ని ఇచ్చే సిల్వర్ ఓక్, కాఫీ, మిరియాలు, జీడిమామిడి, అరటివంటి పంటల ప్రత్యామ్నాయ పంటలుగా వేయాలని సూచించారు. గంజాయి సాగు వల్ల జైలు పాలయ్యి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఆపరేషన్ పరివర్తనపై కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని, రైతులను చైతన్యవంతులు చేస్తున్నామన్నారు. మహిళా పోలీసు భార్గవి శైలజ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమావేశానికి అధికారుల గైర్హాజరు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బందం శ్రీదేవి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరుకాకుండా కిందిస్థాయి అధికారులను పంపిస్తున్నారని, ఇది సరికాదన్నారు. సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు) పాల్గొన్నారు. ఆయన వివిధ శాఖల ప్రగతిపై సమీక్షించారు. ఇటీవల ఐ.పోలవరంలో జరిగిన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎటువంటి ప్రోటోకాల్ లేని వ్యక్తులు పాల్గొన్నారన్నారు. ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ మండలస్థాయి అధికారులు కిందిస్థాయి అధికారులను సర్వసభ్య సమావేశానికి పంపడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సీజనల్ వ్యాధులు, మలేరియా, డయేరియా తదితర వ్యాధుల నియంత్రణకు ఆయా శాఖాధికారులు చర్యలు తీసుకోవాన్నారు. పీహెచ్‌సీల్లో మందుల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే కలెక్టర్ దృష్టికి తీసువెళ్లతామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, మంగ, వంశీ కుంజం, నర్రి పాపారావు, సాయిబాబా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



నాయకుడు బాబిని పరామర్శించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గంగవరం: వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి దిండి నాగ మహేష్(బాబి), ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(బాబు), మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బుధవారం పరామర్శించారు. ఈ నెల 3న నాయకుడు దిండి నాగ మహేష్ (బాబి) తండ్రి డి.వి.వి. సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. వైస్ ఎంపీపీ కె.గంగాదేవి, రామతులసి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు. వెంకటేశ్వరరావు, కొత్తాడ సర్పంచ్ కామరాజు దొర, మాజీ సర్పంచ్ దొర, నాయకులు జగదీష్, సతీష్, చిట్టిబాబు, రమణ, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఎంపీ, అరకు ఎమ్మెల్యేల సన్మానం రేపు

అనంతగిరి: మండల కేంద్రంలోని మొండిజామిగుడ రోయల్ రిసార్ట్స్ వద్ద ఈనెల 12న అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తదితరుల సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేగ బోయిన స్వామి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో అత్యవసర సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రెవెన్యూ సభలతో భూసమస్యల పరిష్కారం



రాజుపేటలొద్దిలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సత్య సులోచన



అనుకులపాలెంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమణి

గంగవరం: గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తుందని, రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సత్య సులోచన అన్నారు. రాజుపేటలొద్ది గ్రామంలో బుధ వారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన 47 అర్జీలను స్వీకరించా రు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రాంబాబు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫయాజ్ భాషా, మండల సర్వేయర్ వీరపుదొర, వీఆర్వోలు రాజామణి, సత్యనారాయణ, రవి తదితరు లు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభలు వినియోగించుకోండి

అడ్డతీగల: మండలంలోని డి.రామవరం పంచాయతీలోని అనుకులపాలెంలో తహసీల్దార్ పి.నాగమణి అధ్యక్షతన బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వ్యక్తిగత కుల, నివాస, ఆదాయ, ధ్రువీకరణలతో పాటు భూ సంబంధమైన సమస్యలు పరిష్కారానికి నిబంధనలు వంటి వివరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన నేడు



వినియోగదారుల అవగాహన సదస్సు ఏర్పాటు కోసం పోలీసులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సభ్యులు

జి.మాడుగుల: మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో గురువారం జరగనున్న వారపు సంతలో వినియోగదారుల హక్కులు, చట్టాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బూడిద చిట్టిబాబు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వారపు సంతల్లో కల్తీ, నకిలీ ఆహార పదార్థాలు, వస్తువులు, తూనికలు, మోసాలపై వారపు సంతల్లో అవగాహన కల్పిస్తామన్నారు. వినియోగదారులను ఆదుకునేందుకు సంఘాలు ఉన్నాయని భరోసా ఇచ్చారు. వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల వినియోగదారుల సంఘం నాయకులు, స్థానికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు మద్దిగరువు వారపు సంతలో వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు పోలీసుల అనుమతి కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తుపత్రాన్ని అందజేశామన్నారు.

మెరుగైన బోధన అందించాలి



మర్రిపాలెంలో విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎంఈవో బాబూరావు పడాల్

జి.మాడుగుల: మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఎంఈవో చిట్టపులి బాబూరావు పడాల్ తెలిపారు. మండలంలో కొక్కిరాపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో వెన్నెలకోట, మర్రిపాలెం, కిముడుపల్లి, దేవరాపల్లి, బలిజపేట గ్రామాల్లో మండల పరిషత్ పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు విద్యా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో వంటగది, మరుగుదొడ్లు నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన పరిశీలించారు. పాఠశాల నిర్వహణ పట్ల ఉపాధ్యాయులకు ఆయన పలు సూచనలు చేశారు. సీఆర్పీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి



గంగవరంలో ఓ ఇంటి ఆవరణలో డ్రమ్మును పరిశీలిస్తున్న వైద్యాధికారి భావన, సిబ్బంది

గంగవరం: మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరి బాధ్యతని, గృహాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక పిహెచ్‌సీ వైద్యాధికారి ఓ.భావన అన్నారు. వైద్యాధికారి భావన ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటా పర్యటించి పరిసరాలను పరిశీలించారు. ఇంటి ఆవరణల్లో నిల్వ ఉన్న నీటిలో లార్వాను గుర్తించి నిర్మూలించారు. దోమల వ్యాప్తిపై , దోమ తెరల వినియోగంపై అవగాహన కల్పించారు. పీహెచ్ఎన్ మేరీ, హెచ్‌వీ విజయలక్ష్మి, ఏఎన్ఎంలు ప్రియ, సుబ్బలక్ష్మి, ఆశాలు రామాయమ్మ, మూర్తి తదితరులున్నారు.

మేలైన పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి



మొల్లేరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధకశాఖ సిబ్బంది

గంగవరం: మేలైన పశుగ్రాసాన్ని పశువులకు మేపడం ద్వారా అధిక పాల దిగుబడి సాధించవచ్చని నెల్లిపూడి గ్రామీణ పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి పరిశిక అప్పన్నబాబు రైతులను సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మొల్లేరు గ్రామంలో రైతులకు పశుగ్రాసాలు వాటి ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. పసుగ్రాసం సాగు, అనావృష్టి సమయాల్లో పశుగ్రాసాల నిల్వ తదితర అంశాలను వివరించారు. రైతులకు పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందజేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది అనంతలక్ష్మి , తరుణ్, నవ్య, చిన్నబాబు, క్రాంతి, రైతులు, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు తీరని నష్టం

- కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వ్యతిరేక విధానాలపై ధ్వజం
- కార్మిక సంఘాల ఆందోళనలు



పాడేరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు



చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



జి.మాడుగులలో అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



రాజవొమ్మంగిలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు

పాడేరు/చింతపల్లి రూరల్/కొయ్యూరు/అడ్డతీగల/కూనవరం/చింతూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్‌తో పాటు పలువురు నేతలు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్మికులంతా సంఘటిత పోరాటాలతోనే వాటిని అడ్డుకోగలమని పిలుపునిచ్చారు. కార్మికుల విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి మార్చుకోవాలన్నారు. కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్ అమలు కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. అంగన్వాడీల మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామి ,108, 104 తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలన్నారు. కార్మి కులకు కనీస వేతం రూ.26వేలు చేల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ చేపడుతున్న డిమాండ్స్‌డేను విజయవంతం చేయాలన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలు మండలాల్లో అధికారులకు నేతలు వినతిపత్రాలు అందజేశారు. కార్మికుల చట్టాలు పటిష్టంగా అముల పరిచి, హక్కులను కాపాడాలని పిలుపునిచ్చారు. పాడేరులోని ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఆశా, సీహెచ్‌డబ్ల్యూల యూనియన్ జిల్లా నాయకులు దాసమ్మ, పార్వతమ్మ, కొండమ్మ, సీటూ, కార్మిక సంఘాల నాయకులు ధనుంజయ్, సుందర్‌రావు, చిరంజీవి, నిర్మల, సురేష్, అప్పలనాయుడు, సూరిబాబు, ముత్యాలమ్మ, అచ్చియమ్మ, అన్నపూర్ణ, లక్ష్మి ప్రసన్న, పాడియం లక్ష్మణ్ , నూకరత్నం, వీరమ్మ, సురేష్, మీనా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యక్రర్తల సమస్యలపై వినతి

ముంచంగిపుట్టు/జి.మాడుగుల/రాజవొమ్మంగి/గంగవరం: ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని, బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయు) ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘాల నాయకులతో పాటు పలువురు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, ఐఎల్‌సీ సిఫార్సు ప్రకారం కనీసం వేతనాలు రూ.26వేలు, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు.ఐసీడీఎస్ ప్రైవేటీకరణ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, నేతలు శ్రీను, మోదకొండమ్మ, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.